
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## ఇప్పుడేం చేస్తున్నారు?

## బాలనటులు

## ( విజయచిత్ర 1982, నవంబర్ నుంచీ పునర్ముద్రణ)


**రాము**



"పాపం పసివాడు" ఫేం మాస్టర్ రాము ప్రేక్షక కోటికి సుపరిచితుడు. రాము నటించిన మొదటి చిత్రం అదేనేమోనని కొందరు అపోహ చెందడం కూడా కద్దు. కాని అప్పటికి మూడేళ్ళకు ముందే రాము నటనారంగంలో ప్రవేశించాడు. తెలుగులో అతని తొలి చిత్రం నిండు హృదయాలు (చిన్న శోభన్‌గా). దానికన్నా ముందే 'ఎంగమామ' తమిళ చిత్రంలో నటించాడతను. అప్పట్లో ఎ.వి.ఎం వారు తెలుగులో 'మూగనోము' తలపెడుతూ, ఆ చిత్రంలోని ప్రధాన బాలపాత్రకు రాము మరీ చిన్నవాడు కావడంతో తామే తమిళంలో నిర్మిస్తున్న 'ఎంగమామ' చిత్రంలో తొలి అవకాశాన్ని కల్పించారు. అప్పటికి రాము వయసు కేవలం మూడేళ్ళే. ఆ చిత్రంలో హీరో శివాజీకి వచ్చీరాని మాటలతో ముద్దొచ్చే ముచ్చటైన రాము నటన నచ్చడంతో, తానే స్వయంగా అనేక చిత్రాల్లో నటనావకాశాలిప్పించడం జరిగింది. రాము అక్షరాలా రూపాయికి నాలుగు పావలాల తెలుగువారబ్బాయి. అయినా ఇంతవరకూ నటించిన దాదాపు వంద చిత్రాల్లో హిందీ, గుజరాతీ, కన్నడ, మలయాళ

భాషాచిత్రాలు కూడా ఉన్నాయి. విధివిలాసం తెలుగులో రాము నటించిన రెండవ చిత్రం. విశేషమేమిటంటే ఆ చిత్రంలో రాముకు అక్కగా నటించిన బేబీ శ్రీదేవికి కూడా తెలుగులో అది రెండవ చిత్రమే. పగసాధిస్తా చిత్రంతో రాము పరిశ్రమలో బాలనటునిగా నిలబడగలిగాడు. పాపం పసివాడులో హీరో పాత్ర ద్వారా ఆంధ్రదేశంలో ఊరూరా పర్యటించి, ప్రజల్లో గొప్ప పాపులారిటీని సంపాదించుకున్నాడతను. ఆ చిత్రం తర్వాత మాయదారి మల్లిగాడులో కూడా ఎన్నదగిన మంచి పాత్ర లభ్యమయిందతనికి. నటుడు కీ.శే జయకృష్ణ నిర్మాతగా సగంలో ఆగిపోయిన బాలనాగమ్మలో బాలవర్ధరాజుగా రాము నటించిన విషయం పాఠకులకు విదితమే. రాము నటించిన చిత్రాల్లో పసి హృదయాలు, సంసారం, చిరంజీవి రాంబాబు, జీవనతీరాలు, చరిత్రహీనులు బంగారు తల్లి, రామయ్య తండ్రి చెప్పుకోదగ్గవి. ఇటీవల రాము నటించిన రామదండు, సీతాకోక చిలుక, ఊరికొక్కడు (డబ్బింగ్) చిత్రాలు విడుదలయ్యాయి. ఆ మధ్య దర్శకులు తాతినేని ప్రకాశరావు అందరూ బాలతారల్తో నిర్మించిన గంగాభవాని హ్రస్వ చిత్రంలో నటించిన రాము, ప్రస్తుతం ఆయనే నిర్మిస్తున్న 'ఎంగళాలుం ముడియుం' తమిళ చిత్రంలోనూ, మనిషికో చరిత్ర చిత్రంలోనూ నటిస్తున్నాడు. స్వర్గీయ శ్రీ దేవర్ రాము ముఖ్య పాత్రధారిగా తలపెట్టిన "సింహంతో బాలుడు" ద్విభాషా చిత్ర నిర్మాణం ఆయన ఆకిస్మిక మరణంతో ఆదిలోనే ఆగిపోయింది. భవిష్యత్తులో వర్ధమాన హీరోగా శ్రీ తాతినేని ప్రకాశరావు తనను పరిచయం చేస్తానన్నారన్న ఆశాభావాన్ని రాము వ్యక్తం చేశాడు.

**రాజా**



సుడిగుండాలు ఫేం మాస్టర్ రాజా పేరు ఈనాటికీ ప్రేక్షకులకు తప్పకు గుర్తుంటుంది. ఆ చిత్రంలో నాగేశ్వరరావు కుమారునిగా ఒక కీలక పాత్ర ధరించాడతను. రాజా ప్రముఖ నటులు కాంతారావుగారబ్బాయి. ఒకసారి కాంతారావుగారింటికి ఏదో పనిమీద వచ్చిన స్వర్గీయ శ్రీ ఆదుర్తి సుబ్బారావు, అదే సమయంలో తండ్రి ఫక్కీలో కత్తి యుద్ధం చేస్తున్న రాజాను చూసి ముచ్చటపడి, వెంటనే సుడిగుండాలులో బుక్ చేయడం జరిగింది. దరిమిలా సప్తస్వరాలు, ఎవరు మొనగాడు, ఉక్కుపిడుగు, రాజయోగం ఇత్యాది చిత్రాల్లో నటించాడతను. మూడేళ్ళ వయసులోనే మైరావణ చిత్రంలో చిన్న కృష్ణునిగా అతను కొన్ని నిమిషాలపాటు అభినయించడం జరిగింది. సుడిగుండాలు తర్వాత అదే చక్రవర్తి చిత్ర బేనర్‌లో మరో మంచి ముఖ్యపాత్ర మరో ప్రపంచంలో రాజాకు లభ్యమయింది. రాజా నటించిన ముఖ్య పాత్రల్లో అతను చివరగా నటించిన చిత్రం 'మనుషులు మట్టిబొమ్మలు'. ఆ చిత్రంలో అవిటి బాలునిగా కరుణరస ప్రధానమైన పాత్రలో మంచి పేరు తెచ్చుకున్నాడతను. ప్రస్తుతం బి.కాం చదువుతున్న రాజా భవిష్యత్తులో సినీ నేపథ్యగాయకునిగా స్థిరపడాలనుకుంటున్నాడు.

**నాగేశ్వర రావు, శేషగిరి, బాలు**



అలనాటి సాధనావారి సంతానం చిత్రం చూసిన వారికి ఆ చిత్రంలో చిన్న నాగేశ్వరరావుగా నటించిన మాస్టర్ నాగేశ్వరరావు తప్పక గుర్తుంటాడు.

ఆ చిత్రంలో జూనియర్ హీరోగా అతను చేసే చిలిపి చేష్టలూ,కొంటెపనులూ ఈనాటికీ స్ఫురణకు రాక మానవు. అలాగే రేచుక్కలో చిన్న ఎన్.టి.ఆర్.గా కూడా అప్పట్లో పరిశ్రమనుండీ, ప్రేక్షకుల నుండీ మంచి మార్కులు సంపాదించుకున్నాడతను. జనతావారి పరివర్తనలో కూడా హీరోయిన్ సావిత్రికి తమ్ముడిపాత్రలో హృద్యమైన నటన ప్రదర్శించి అందరి అభినందనలూ అందుకున్నాడు. ఆ చిత్రంలో అతని మీదనే' ఔనంటారా కాదంటారా' అన్న పాట కూడా చిత్రీకరించబడింది. అప్పట్లో సినిమా టైటిల్సులోనూ, పత్రికల్లోనూ అతని పేరు నాగేశ్వరరావు (జూ) అని ప్రకటించబడేది. అప్పట్లోనే బీదల ఆస్థి, పెంకిపెళ్ళాం, బండరాముడు, అక్కచెల్లెళ్ళు వంటి పెక్కు చిత్రాల్లో నటించాడతను. చివరిగా అతను నటించిన చిత్రాలు శభాష్ రాజా, తండ్రులు కొడుకులు. అలనాటి మాస్టర్ నాగేశ్వరరావు ప్రస్తుతం మద్రాసులోనే ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ కపిల నాగేశ్వరరావుగా మనుగడను కొనసాగిస్తున్నారు. విఠలాచార్యగారి స్వంత చిత్రాలకూ, విశ్వ చిత్ర సంస్థకూ ముఖ్యంగా ఇప్పుడాయన పని చేస్తున్నారు. ఆ మధ్య జయమాలిని నటించిన ఒక తమిళ చిత్రాన్ని కరాటే కమల పేరుతో ఆయన స్వంతంగా తెలుగులో డబ్ చేశారు. నాగేశ్వరరావు సోదరులైన శేషగిరి, బాలు కూడా ఒకనాటి బాలనటులే. శేషగిరి అమరసందేశం, వదినగారి గాజులు, దైవబలం వగైరా చిత్రాల్లో నటించినా, రాజ్యం పిక్చర్స్ హరిశ్చంద్రలో లోహితాస్యుని పాత్ర అతనికి మంచిపేరు తెచ్చి పెట్టింది. మూడవవాడైన బాలు శాంతినివాసం, టైగర్ రాముడు, కులదైవం, చదువుకున్న భార్య ఇత్యాది చిత్రాల్లో నటించినా 'నాదీ ఆడజన్మే' చిత్రంలో ధరించిన రమణారెడ్డి కొడుకు పాత్ర హాస్యరసభరితంగా రూపొంది అతనికి పేరు తెచ్చిపెట్టింది. ముగ్గురన్నదమ్ములూ పరివర్తన, తోడుదొంగలు, సంతానం, ఉమాసుందరి మున్నగు చిత్రాల్లో కలిసి నటించారు. ప్రస్తుతం బాలు మద్రాసులోనూ, శేషగిరి విజయవాడలోనూ బ్యాంక్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. నాగేశ్వరరావు వచ్చే యేడాది స్వంత చిత్ర నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు.

**బాబ్జీ**



చెంచులక్ష్మి సినిమాలో సుశీల పాడిన 'పాలకడలిలో శేషతల్పమున ' అన్న పాట వినగానే ఆ చిత్రం గుర్తున్న వారికి మాస్టర్ బాబ్జీ జ్ఞప్తికి రావడం సహజం. ఆ పాటలాగే ఆ చిత్రంలోని అతని ప్రహ్లాద పాత్ర కూడా అప్పట్లో బాగా పాపులర్ అయింది. బాబ్జీ పుష్పవల్లి కుమారుడు. ప్రముఖ

హిందీనటి రేఖ అతని చెల్లెలు. అన్నాచెల్లెళ్ళిద్దరూ తల్లితో కలసి, 'ఇంటిగుట్టు' చిత్రంలో నటించారు. బాబ్జీ తొలిసారిగా నటించిన చిత్రం వళ్ళియిన్ సెల్వన్ (తమిళం). చిరంజీవులలో చిన్న ఎన్.టి.ఆర్‌గానూ, మాంగల్యబలంలో చిన్న ఏ.యన్.ఆర్‌గానూ, సువర్ణ సుందరిలో అక్కినేని కుమారుని గానూ, సంకల్పంలో నందమూరి తనయునిగానూ, భక్తమార్కండేయునిగానూ, మాయాబజార్‌లో అంతర్నాటక సన్నివేశంలో బాలకృష్ణునిగానూ నటించి ప్రేక్షకులనుండి గుర్తింపు సంపాదించుకున్నాడతను. తెలుగులో అతని చివరి చిత్రం మామకు తగ్గ అల్లుడు. ఆ తర్వాత తమిళంలో చాలా చిత్రాల్లో నటించాడు. వర్ధమాన యువనటుడుగా జ్ఞానఒళి, పట్టిగాడా పట్టణమా, కులవిళక్కు, వియత్నాం వీడు తమిళ చిత్రాల్లో నటించాడతను. సోదరి రేఖతోపాటు తాను కూడా బొంబాయికి మకాం మార్చడంతో సంగీతం పట్ల తనకున్న అభిరుచి కొద్దీ సంగీతం పట్ల తనకున్న అభిరుచి కొద్దీ సంగీత శాఖలో విశేషంగా కృషి చేయడం జరిగింది. సంగీత దర్శకుడుగా పరమాత్మ చోర్ స్వామీ, జాయేతో జాయే కహో, యాదోంకీ జంజీర్ చిత్రాలకు వ్యవహరించారు. 1979లో తానే దర్శక నిర్మాతగా, సంగీత దర్శకుడుగా కథ, స్క్రీన్‌ప్లే మాటలు స్వయంగా సమకూర్చి 'నయాబకరా' హిందీ చిత్రాన్ని రూపొందించారు. ఆ చిత్రంలో లేతమనసులు ఫేం (బేబీ) పద్మిని, వినోద్ మెహరా ముఖ్య జంటగా నటించారు. 1970లో బాబ్జీకి వివాహమయింది. ఇటీవలనే బొంబాయి నుండి మద్రాసుకు మకాం మార్చిన మిస్టర్ బాబ్జీ ప్రస్తుతం ఒక తమిళ చిత్ర నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. వేరే నిర్మాతకు తన రచన దర్శకత్వంలో రూపకల్పన చేయనున్న ఆ చిత్రం ఈ సంవత్సరాంతంలోగా ప్రారంభమవుతుంది. వీలును బట్టీ త్వరలోనే తెలుగులో కూడా ఒక చిత్రాన్ని చేపట్టగలనన్న ఆశాభావాన్ని బాబ్జీ వ్యక్తం చేశారు. లోగడ తను పని చేసిన ప్రతి చిత్రంలోనూ ఏదో ఒక సన్నివేశంలో సరదాగా కనిపించిన తనకు దర్శకత్వం పట్ల అభిరుచి ఎంతగా వున్నా నటన పట్ల అభిలాష కూడా లేకపోలేదనీ, తన ఆకృతికీ, విగ్రహానికీ సరిపడగల పాత్ర లభ్యమైతే తప్పక తన నటనా జీవితాన్ని కొనసాగించగలననీ అన్నారు బాబ్జీ.

**వరలక్ష్మి – రాణి – సరస్వతి**



జీవనజ్యోతి, పంతులమ్మ, పాలు – నీళ్ళు చిత్రాలతో బాలతారలుగా అవార్డులందుకున్న బేబీ వరలక్ష్మి, రాణి, సరస్వతి ముగ్గురూ అక్కచెల్లెళ్ళు. సరిగ్గా ఊహకూడా తెలియని వయసులో బాలతారలుగా అంత మంచి పేరు తెచ్చుకోగలిగారంటే ఆ ఘనత వారి తండ్రి ఆనంద్‌గారికే దక్కవలసి ఉంటుంది. నటునిగా స్థిరపడాలన్న అభిలాషతో మద్రాసు వచ్చిన ఆనంద్ తన విషయంలో కృతకృత్యుడు కాలేకపోయినా తనలోని కళాపిపాసను ఒకవిధంగా తన బిడ్డల రూపేణా తీర్చుకోవడం జరిగింది. 1973లో స్నేహబంధం, పల్లెటూరిబావ,అందాలరాముడు చిత్రాలతో బాలతారగా అడుగుపెట్టిన వరలక్ష్మి

నిప్పులాంటి మనిషి చిత్రంతో పరిశ్రమలో బాలనటిగా గుర్తింపు పొందింది. తదుపరి జీవనజ్యోతిలో దర్శకుడు కె.విశ్వనాథ్ ఒక చక్కని కరుణరసాత్మక పాత్రలో వరలక్ష్మిని ప్రోత్సహించడం జరిగింది. అలాగే దర్శకుడు బాపు కూడా 'స్నేహం' చిత్రంలో గలగలా నవ్వే ఒక విషాద బాలపాత్రను ఆమె చేత మిన్నగా చేయించగలిగారు. వరలక్ష్మి నటించిన ఇతర చిత్రాల్లో భక్త కన్నప్ప, సోగ్గాడు, మాంగల్యానికి మరోముడి, శంకరాభరణం, పల్లెసీమ, స్వర్గసీమ మరికొన్ని. వరలక్ష్మి చెల్లెలు రాణి, దాసరి దర్శకత్వంలో యవ్వనం కాటేసింది, ముద్దబంతి పువ్వు, పాడవోయి భారతీయుడా చిత్రాల్లో బాలనటిగా మంచి పేరు తెచ్చుకుంది. పంతులమ్మ చిత్రంలో రాణి నటించిన అబ్బాయిపాత్ర ఎన్నో అవార్డులనూ, ప్రశంసలనూ ఆర్జించిపెట్టింది. రాణి చెల్లెలు సరస్వతి తొలిసారిగా కార్తీక దీపంలో నటించింది. తర్వాత దేవుడు మామయ్య, సన్నాయి అప్పన్న చిత్రాల్లో నటించింది. గత యేడాది విడుదలైన పాలు నీళ్ళలో, బాలపాత్రలో సరస్వతి రాణించి ఉత్తమ బాలనటి అవార్డు అందుకుంది. రాణి నటించిన బంగారు కానుక, సరస్వతి నటించిన గృహప్రవేశం ఆ మధ్య విడుదలయ్యాయి. బాలతారలుగానే కాక గాత్రధారణలో కూడా వీరిద్దరూ కృషి చేస్తూ ఇతర బాలతారలు కొందరికి డబ్బింగ్ చెబుతూండడం ఒక విశేషం. సరస్వతి ప్రస్తుతం దేవుని రూపాలు, ప్రేమ దీపాలు, సుమన్ క్రియేషన్స్ చిత్రాలలో నటిస్తూంది. ఇటీవలనే కుమారిగా ఎదిగిన వరలక్ష్మి మరో ఏడాదిలోగా వర్ధమాన యువకథానాయికగా తెలుగు తెరను అలంకరించాలనుకుంటున్నది.

Post your comments